



కళాకారుల నృత్యం

సంగారెడ్డిలో ఉత్సవాలకు భారీగా హాజరైన ప్రజలు

ఈనాడు సంగారెడ్డి

సోమవారం అక్టోబరు 14, 2024

అంబరాన్నంటిన దసరా సంబురం

జిల్లావ్యాప్తంగా శనివారం దసరా ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. జమ్మిచెట్టుకు పూజలు నిర్వహించిన అనంతరం రావణదహన కార్యక్రమాలు చేపట్టారు. భక్తులు భారీగా తరలివచ్చి ఉత్సవాల్లో పాల్గొన్నారు. సంగారెడ్డిలోని అంబేడ్కర్ మైదానంలో నిర్వహించిన వేడుకల్లో టీజీఐఐసీ ఛైర్‌పర్సన్ నిర్మలారెడ్డి, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఖేడ్‌లో ఎంపీ సురేష్ షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి, జహీరాబాద్‌లో ఎమ్మెల్యే మాణిక్‌రావు జమ్మి పూజలు నిర్వహించారు. –న్యూస్‌టుడే, సంగారెడ్డి అర్బన్, సంగారెడ్డి మున్సిపాలిటీ, జహీరాబాద్, నారాయణఖేడ్.



సంగారెడ్డిలో రావణ దహనం



జమ్మి పూజలో టీజీఐఐసీ ఛైర్‌పర్సన్ నిర్మలారెడ్డి, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి తదితరులు



ఖేడ్‌లో ఎంపీ సురేష్ షెట్కార్, నాయకులు

సమస్యలు అధిగమిస్తేనే..
సాఫీగా కొనుగోలు

• 20 నుంచి ప్రారంభం కానున్న ధాన్యం సేకరణ కేంద్రాలు



జిల్లాలో ధాన్యం సేకరణ గణాంకాలిలా..

- వరి సాగు లక్ష్యం(ఎకరాల్లో): 1,50,000
- సాగయింది (ఎకరాల్లో): 1,49,369
- ధాన్యం సేకరణ లక్ష్యం (మెట్రిక్ టన్నులు): 2,11,111
- అవసరమయ్యే గన్నీ సంచులు: 52,77,778
- అందుబాటులో ఉన్నవి: 19,28,115
- కావాల్సిన తేమ యంత్రాలు: 330
- తూకం వేసే యంత్రాలు: 298
- పాడీ క్లీనర్లు: 229
- అందుబాటులో ఉన్న తాటిపత్రులు: 5500
- ఇంకా కావాల్సినవి: 5600
- జిల్లాలో రైస్ మిల్లులు: 69

న్యూస్‌టుడే, సంగారెడ్డి అర్బన్

రైతులకు సౌకర్యవంతంగా ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతి సంవత్సరం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోంది. వాటిలో సరైన సదుపాయాలు లేకపోవడంతో ఏటా రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొన్ని చోట్ల కర్షకులు ఆందోళన చేసిన ఘటనలూ ఉన్నాయి. ఈ నెల 20 నుంచి ధాన్యం సేకరణకు జిల్లా యంత్రాంగం కార్యాచరణ ప్రకటించిన నేపథ్యంలో.. ఈసారైనా సౌకర్యాల కల్పనపై అధికారులు దృష్టి సారించాలని కర్షకులు కోరుతున్నారు.



గతేడాది హత్నూరలోని మిల్లు వద్ద అన్‌లోడింగ్‌కు వేచి ఉన్న లారీలు

సమన్వయ లోపం..

ఏటా అధికారుల మధ్య సమన్వయ లోపం అన్నదాతలకు శాపంగా మారుతోంది. వ్యవసాయ శాఖ నుంచి ఏఈవోలు, ఏడీలు, డీఆర్‌డీఏ తరపున వీఏవోలు, ఐకేపీ సీసీలు, డీసీఎంఎస్, పీఏసీఎస్, రెవెన్యూ, కింది స్థాయి నుంచి జిల్లా స్థాయి అధికారుల వరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను నిత్యం పరిశీలించాలి. అక్కడ రైతులకు ఎలాంటి ఇబ్బందులున్నాయి? వాటికి పరిష్కార మార్గాలేమిటి? తదితర అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి. సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలి.

వీటిపై దృష్టి సారిస్తే మేలు

• ధాన్యం తరలించేందుకు సరిపడా లారీలు లేకపోవడంతో అన్నదాతలు వారం, పది రోజుల పాటు కేంద్రం వద్దే పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఉంటోంది. ఈలోగా వర్షం కురిసి ధాన్యం తడిస్తే.. ఆ నష్టాన్ని రైతులే భరించాల్సిన పరిస్థితి ఏటా నెలకొంటోంది.

• సరిపడా హమాలీలు లేకపోవడంతో ధాన్యం తూకం వేయడానికి, మిల్లులకు తరలించిన బస్తాలను అన్‌లోడ్ చేయడానికి రోజుల పాటు నిరీక్షించాల్సిన పరిస్థితి గతంలో తలెత్తింది.

• ప్రతి కొనుగోలు కేంద్రంలో నిర్దేశించిన తాటి పత్రులు, గన్నీ సంచులు అందుబాటులో ఉంచాలి.

• కొన్ని కేంద్రాల్లో గతంలో తరుగు పేరిట అధిక ధాన్యాన్ని తూకం వేసి మోసాలకు పాల్పడ్డారు. • ధాన్యం విక్రయించిన రైతుల వివరాలు ట్యాబుల్లో నమోదులో జాప్యం వల్ల డబ్బులు ఖాతాల్లో జమ చేయడానికి జాప్యమైంది.

మద్దతు ధర ఇలా.. (క్వింటాలుకు)

- ‘ఏ’ గ్రేడ్ ధాన్యం: రూ. 2320
- సాధారణ రకం: రూ. 2300

ఇబ్బందులు అధిగమించేలా చర్యలు

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో యాసంగిలో కొన్ని సమస్యలు తలెత్తాయి. అవి పునరావృతం కాకుండా ఈ సారి పకడ్బందీ చర్యలు తీసుకుంటాం. హమాలీలు, లారీలు, గన్నీ సంచులు, తాటి పత్రులు అందుబాటులో ఉండేలా కార్యాచరణ సిద్ధం చేశాం. శాఖల మధ్య సమన్వయం చేసుకుంటాం. రైతులు కూడా అధికారులకు సహకరించాలి. తాలు లేకుండా ధాన్యం తీసుకురావాలి. – కొండల్‌రావు, డీఎం, సివిల్ సప్లయ్ విభాగం.

బావి నీరు.. జనం బేజారు

ఇద్దరి మృతి.. పలువురికి అస్వస్థత



సాయమ్మ



మహేష్

నారాయణఖేడ్, న్యూస్‌టుడే: నారాయణఖేడ్ మండలం సంజీవన్‌రావుపేటలో కలుషితనీటిని తాగిన సుమారు 50 మంది అస్వస్థతకు గురవగా.. ఇద్దరు మృతి చెందారు. దీంతో గ్రామస్థుల్లో ఆందోళన మొదలైంది. గ్రామంలోని మూడు ట్యాంకుల్లో ఒకదానికి నీటిని సరఫరా చేసే చెరువు పక్కన బావిలో నాచు, చెట్ల ఆకులు, వేర్లు తదితరాల వల్ల అపరిశుభ్రంగా మారింది. ఇక్కడి నుంచి నీరు సరఫరా అయ్యే రెండు కాలనీల్లో ప్రజలు మాత్రమే నాలుగు రోజులుగా అస్వస్థతకు గురవుతున్నారు. గురు, శుక్రవారాల్లో ఇంటికి ఒకరిద్దరు చొప్పున వాంతులు, విరేచనాలతో స్వల్ప అస్వస్థతకు గురవగా స్థానికులు అంతగా అనుమానించలేదు. శనివారం ఒక్కరోజే సుమారు 35 మంది అనారోగ్యానికి గురవడంతో స్థానికులతోపాటు, అధికారులు, ప్రజాప్రతినిధులు బావిని పరిశీలించగా అపరిశుభ్రత వెలుగులోకి వచ్చింది. నీటి కలుషితం వల్లే ఇలా జరుగుతోందని నిర్ధారించుకుని శనివారం ఎమ్మెల్యే సంజీవరెడ్డి, ఆర్డీవో అశోక చక్రవర్తి నీటి శాంపిల్‌ను పరీక్షలకు పంపించారు. బావి నీటిని తోడేయించి, ట్యాంకును క్లోరినేషన్ చేయించాలని కార్యదర్శి నాగలక్ష్మి, ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డిలను ఆదేశించారు. గ్రామంలోని ‘పల్లె దవాఖానా’లో శనివారం, ఆదివారం వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయించి పలువురికి వైద్యం అందిస్తున్నారు. శనివారం గ్రామంలో 70 మందిని పరీక్షించి వారిలో కొందరికి స్థానికంగా, మరి కొందరిని ఖేడ్ ప్రాంతీయ ఆసుపత్రి, సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.



బావిలో కలుషిత నీరు

ఇద్దరి మృతితో విషాదఛాయలు

సంజీవన్‌రావుపేటలో శుక్రవారం బోడ మహేష్(24), శనివారం తెల్లవారుజామున బాయికాడి సాయమ్మ(87) మృతిచెందారు. వారి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కలుషిత నీటి వల్లే వీరు చనిపోయారని గ్రామస్థులు, ఆయా కుటుంబీకులు ఆరోపిస్తుండగా సాయమ్మ వృద్ధ్యాప్యం కారణంగా, మహేష్ అపెండిసైటిస్ కారణంగా మృతిచెందినట్లు డీఎంఅండ్‌హెచ్‌ఓ గాయత్రీదేవి తెలిపారు. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించడంలో కాంగ్రెస్ విఫలమైందని మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి విమర్శించారు. ఖేడ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించిన సందర్భంగా మాట్లాడారు.

ఉపాధికి చేయూత

పీఎంఈజీపీతో నిరుద్యోగ యువతకు రాయితీ రుణాలు

న్యూస్‌టుడే, సంగారెడ్డి టౌన్, జోగిపేట



గొల్లగూడెంలో పాడి పశువుల యూనిట్‌ను పరిశీలిస్తున్న అధికారులు(పాతచిత్రం)

ప్రైవేటు సంస్థలు, పరిశ్రమల్లో ఎక్కువగా ఖాళీలు లేకపోవటంతో నిరుద్యోగుల సంఖ్య ఏటా పెరుగుతూనే ఉంది. ఉన్నత చదువులు చదివినా ఉద్యోగాలు దొరకని పరిస్థితి నెలకొంది. నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న ఇబ్బందులు తీర్చాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రాయితీ రుణ పథకాలు అమలు చేస్తోంది. ఇందులో భాగంగానే కేంద్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతకు మేలు చేకూర్చేందుకు వీలుగా ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రాం(పీఎంఈజీపీ) ద్వారా స్వయం ఉపాధి యూనిట్లు మంజూరు చేస్తోంది.

పథక లక్ష్యమిది..

నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనకు నూతన మార్గాలు, కొత్త ప్రాజెక్టులు, కుటీర పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహించాలనే ఉద్దేశంతో పీఎంఈజీపీకి కేంద్రం శ్రీకారం చుట్టింది. ఆసక్తి గల యువత నుంచి దరఖాస్తులు స్వీకరించి, ఎంపికైన వారికి రాయితీ రుణాలు అందజేస్తూ చేయూతనిస్తున్నారు. ఇందులో ఉత్పత్తి పరిశ్రమలకు, వ్యక్తులు, సంస్థలకు రూ.25లక్షలు, ఉత్పత్తేతర(సర్వీసు) పరిశ్రమలకు రూ.10లక్షల వరకు రాయితీ రుణాలు అందజేస్తారు. డీఐసీ(డిస్ట్రిక్ట్ ఇండస్ట్రియల్ సెంటర్), కేవీఐసీ(ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్), కేవీఐబీ(ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ బోర్డు) విభాగాల ద్వారా యూనిట్లు మంజూరు చేస్తూ నిరుద్యోగ యువత ఉపాధికి బాటలు వేస్తున్నారు.

యూనిట్ల గ్రౌండింగ్ తీరు

సంవత్సరం	గ్రౌండింగ్	నిధులు
2023-24	35	రూ.1.04కోట్లు
2024-25	10	రూ.47.84లక్షలు

(సెప్టెంబరు నెలాఖరు నాటికి)

తుది గడువు లేదు

పీఎంఈజీపీ కింద సాయం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. దరఖాస్తులకు తుది గడువు విధించలేదు. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుంది. దరఖాస్తుల కోసం www.kviconline.gov.in వెబ్‌సైట్‌లో సంప్రదించాల్సి ఉంటుంది. ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను సంబంధిత బ్యాంకులకు పంపుతారు. ఎంపికైన అభ్యర్థుల ఖాతాలకు రాయితీ నిధులు విడుదల చేస్తారు.

సద్వినియోగం చేసుకోవాలి: తుల్జ్యానాయక్, జిల్లా పరిశ్రమ కేంద్రం జనరల్ మేనేజర్

ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. రాయితీ రుణాల కోసం ఆన్‌లైన్‌లో ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రభుత్వం రాయితీ నిధుల్ని మంజూరు చేసినప్పుడు గ్రౌండింగ్‌కు చర్యలు తీసుకుంటాం. ఈ ఆర్థిక సంవత్సరం లక్ష్యాలకు అనుగుణంగా లబ్ధిదారులను ఎంపికచేస్తాం. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా ఉంటుంది.

తగ్గనున్న దూరాభారం

మల్లన్నగండి కాలనీ-అజ్జమర్రి మధ్య త్వరలో రహదారి పనులు



మల్లన్నగండి కాలనీ శివారులో రెండు వరుసల రహదారి కోసం చదును చేసిన స్థలం

న్యూస్‌టుడే, జోగిపేట: జోగిపేట పట్టణ అభివృద్ధిలో భాగంగా స్థానిక మల్లన్నగండి కాలనీ నుంచి నర్సాపూర్ నియోజకవర్గంలోని అజ్జమర్రి వరకు రెండు వరుసల రహదారి నిర్మాణానికి ప్రభుత్వం రూ.79 కోట్లు మంజూరు చేసింది. ఆర్అండ్‌బీ అధికారులు ఇటీవలే సర్వే పనులు పూర్తి చేశారు. ఈ పనులకు మంత్రి దామోదర్ రాజనర్సింహ మార్చిలో శంకుస్థాపన చేశారు.

6.5 కిలో మీటర్లు: జోగిపేటలోని మల్లన్న గండి కాలనీ నుంచి అజ్జమర్రి వరకు 6.5 కిలో మీటర్ల రహదారిని మంజీరా నది మీదుగా నాలుగు వరుసలు నిర్మించనున్నారు. డివైడర్ నిర్మించి బటర్‌ఫ్లై దీపాలు అమర్చనున్నారు. పనుల్లో భాగంగా ఇళ్లు కోల్పోతున్న వారికి నష్టపరిహారం చెల్లిస్తామని మంత్రి దామోదర్ ప్రకటించారు. ప్రస్తుతం జోగిపేట శివారులోని సంగుపేట నుంచి వెళ్లిన 161 జాతీయ రహదారి వల్ల పట్టణంలోని ఓ వైపునకు వాహనాల రాకపోకలు కష్టమయ్యాయి. దీంతో వ్యాపారాలు దెబ్బతిన్నాయని పలువురు వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రభావాన్ని కాస్తైనా తగ్గించాలనే ఉద్దేశంతో మల్లన్న గండి కాలనీ నుంచి అజ్జమర్రి వరకు లింకు రోడ్డు ప్రతిపాదన చేశారు. నిధులు మంజూరయ్యాయి. ఈ రహదారి పనులు పూర్తయితే నర్సాపూర్ నియోజకవర్గంలోని చిలప్‌చెడ్, అజ్జమర్రి, దౌల్తాబాద్ ప్రాంతాల్లోని సుమారు 15 గ్రామాల ప్రజలకు 9 కిలోమీటర్ల దూరాభారం తగ్గుతుంది.

ముగ్గురు పిల్లలను వదిలేసి..
తండ్రి ఉడాయింపు

పట్టుకొని ఇంటికి చేర్చిన పోలీసులు



చిన్నారులకు భోజనం తినిపిస్తున్న హోంగార్డు కృష్ణవేణి

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: దసరా ఉత్సవాలకు వచ్చిన తండ్రి.. ముగ్గురు పిల్లలను అక్కడే వదిలేసి ఉడాయించే ప్రయత్నం చేశాడు. పోలీసులు పట్టుకునే యత్నం చేయగా తప్పించుకున్నాడు. అనంతరం గాలించిన పోలీసులు తండ్రి, పిల్లలను వారింటికి చేర్చారు. సంగారెడ్డి పట్టణంలోని అంబేడ్కర్ మైదానంలో శనివారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. సంగారెడ్డి మండలం కల్పగూర్‌కు చెందిన శ్రీశైలం మద్యం మత్తులో అంబేడ్కర్ మైదానంలో నిర్వహిస్తున్న దసరా ఉత్సవాలకు వచ్చాడు. వెంట రెండు నెలల పసి కందు శ్రీలీల, ఆరేళ్ల అర్చన, మూడేళ్ల వయసుండే మహేందర్‌ను తీసుకొచ్చాడు. జనంలోనే ఒక్కసారిగా పసికందును కిందపడేసి అక్కడి నుంచి జారుకునే ప్రయత్నం చేశాడు. డీఎస్పీ సత్తయ్య గౌడ్ గమనించి పక్కనే ఉన్న కానిస్టేబుల్ గౌరి సహాయంతో పట్టుకునే ప్రయత్నం చేశారు. శ్రీశైలం తప్పించుకొని పరారయ్యాడు. సుమారు గంటసేపు గాలించిన పోలీసులు శ్రీశైలంను పట్టుకున్నారు. పిల్లలు, తండ్రిని కల్పగూరులోని వారింటికి తీసుకెళ్లి కుటుంబీకులకు అప్పగించారు.

నరసింహస్వామి సేవలో ఎంపీ



కుటుంబ సమేతంగా మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

యాదగిరిగుట్ట: మెదక్ ఎంపీ రఘునందన్‌రావు కుటుంబ సమేతంగా శనివారం యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు. ఆదివారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డితో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు. వీరికి అధికారులు స్వామి దర్శనానికి ఏర్పాట్లు చేశారు.

రాష్ట్ర క్రికెట్ పోటీలకు నలుగురి ఎంపిక

జిన్నారం, న్యూస్‌టుడే: ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు నలుగురు జిన్నారం గిరిజన గురుకులం విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపల్ వెంకటనారాయణ, వైస్ ప్రిన్సిపల్ వెంకటయ్య, కోచ్ మహేశ్ తెలిపారు. అండర్-14 విభాగంలో డి.కార్తిక్(8వ తరగతి), రవీంద్రనాథ్, దరావత్ కార్తిక్(7వ తరగతి), రాథోడ్ ధనుష్(8వ తరగతి)లు ఎంపికయినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ నలుగురు విద్యార్థులు క్రికెట్ అకాడమీలో శిక్షణ పొందుతున్నారన్నారు. నేటి నుంచి ఈ నెల 16 వరకు జోగులాంబ-గద్వాల జిల్లాలో జరిగే పోటీలకు హాజరు కానున్నారన్నారు. విద్యార్థులను అభినందించారు.



డి.కార్తిక్



రవీంద్రనాథ్



దరావత్ కార్తిక్



రాథోడ్ ధనుష్

ఎంఈవోలు వచ్చారు.. ఎమ్మార్సీ భవనాలేవి?

జిల్లాలోని కొత్త మండలాల్లో సమస్య

న్యూస్‌టుడే, సంగారెడ్డి మున్సిపాలిటీ, కంది



కందిలో వృథాగా ఎమ్మార్సీ భవనం

జిల్లాలో గత ప్రభుత్వ హయాంలో కొత్త మండలాలు ఏర్పాటయ్యాయి. వాటి పరిధిలో పాఠశాలల పర్యవేక్షణకు మండల విద్యాధికారులను ఇటీవల నియమించారు. ఎంఈవోలు విధులు నిర్వహించేందుకు కొత్త మండలాల్లో కార్యాలయాలు లేకపోవడంతో.. పాత మండల కేంద్రాల నుంచే సేవలు కొనసాగిస్తున్నారు. దీంతో పాఠశాలల పర్యవేక్షణపై ప్రభావం చూపుతోందనే విమర్శలొస్తున్నాయి. 2016లో కొత్తగా ఏర్పడిన అయిదు మండలాలకు ఎమ్మార్సీ భవనాల కోసం అప్పట్లో ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. అధికారులు పనులను గుత్తేదారులకు అప్పగించారు. పనులు పూర్తయినప్పటికీ వాటిని ఎంఈవోలకు కేటాయించకుండా ఎంపీడీవో కార్యాలయాల కోసం వినియోగిస్తున్నారు. జిల్లాలో ఇటీవల 27 మండలాలకు ఎంఈవోలను నియమించినప్పటికీ. . కొత్త మండలాల్లో కార్యాలయాలు లేకపోవడం సమస్యగా మారింది.

ఎక్కడెక్కడ.. ఎలాంటి పరిస్థితి

జిల్లాలో తొలుత ఆరు, తర్వాత నాలుగు కలిపి కొత్తగా 10 మండలాలు ఏర్పాటయ్యాయి. వీటిలో ఐదు మండలాలకు రూ.30 లక్షల చొప్పున నిధులు కేటాయించి ఎమ్మార్సీ భవనాలు నిర్మింపజేశారు. కందిలో నిర్మించిన భవనం మొదటి నుంచీ వృథాగా ఉంటోంది. కొందరు ఆకతాయిలు అడ్డాగా మార్చుకొని కిటికీల అద్దాలు పగులగొట్టారు. ఈ మండల ఎంఈవో, సిబ్బంది సంగారెడ్డిలోని ఎమ్మార్సీ కార్యాలయం నుంచి సేవలు అందిస్తున్నారు. మొగుడంపల్లి, సిర్గాపూర్, వట్‌పల్లి మండలాల్లో ఎమ్మార్సీ భవనాలు నిర్మించినప్పటికీ.. వాటిని ఎంపీడీవో కార్యాలయాలకు కేటాయించారు. గుమ్మడిదలలో ఇటీవలి వరకు ఎంపీడీవో కార్యాలయం నిర్వహించగా.. ఇటీవలే ఆ భవనాన్ని ఖాళీ చేసి కొత్త భవనంలోకి వెళ్లిపోయారు. మరో ఐదు మండలాలకు ఇప్పటికీ నిధులు మంజూరు కాలేదు.


ఉన్నతాధికారులకు నివేదిస్తాం

మూడు చోట్ల ఎమ్మార్సీ భవనాలు ఎంపీడీవో కార్యాలయాలకు కేటాయించారు. కందిలో వృథాగా ఉంది. మిగతా చోట్ల భవనాలు మంజూరు కాలేదు. దీంతో ఇబ్బందులు పడుతున్నామని ఎంఈవోలు మా దృష్టికి తీసుకొచ్చారు. కొత్త భవనాల కోసం ఉన్నతాధికారులకు నివేదిస్తాం. – వెంకటేశ్వర్లు, జిల్లా విద్యాధికారి.

పాఠశాలల్లోనే గది కేటాయింపు

కొన్ని రోజుల క్రితం వరకు చాలా చోట్ల ఎంఈవో పోస్టులు ఖాళీగా ఉండటంతో పాత మండలాల నుంచే ఇన్‌ఛార్జిలు పాఠశాలలను పర్యవేక్షించేవారు. ఇటీవల అన్ని మండలాలకు మండల విద్యాధికారులను నియమించారు. భవనాలు లేకపోవడంతో మండల కేంద్రాల్లోని ఉన్నత పాఠశాలల్లో వారు ఓ గదిని కేటాయించుకుంటున్నారు. ఈ గదిలో కంప్యూటర్ ఆపరేటర్, ఎంఐఎస్ సమన్వయకర్తతో పాటు ఎంఈవో విధులు నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ చిన్న గదిలో ఎలా విధులు నిర్వహించాలని ఎంఈవోలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పరిహారం.. ఆశావహం



న్యూస్‌టుడే, తూప్రాన్, నర్సాపూర్, గజ్వేల్: రీజనల్ రింగు రోడ్డు (ఆర్ ఆర్ఆర్) నిర్మాణంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఉమ్మడి మెదక్ జిల్లాలో సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాలోని గ్రామాల్లో ఇప్పటికే ప్రాంతీయ రింగు రోడ్డు నిర్మాణానికి భూ సేకరణ ప్రక్రియ చేపట్టారు. రైతులకు మెరుగైన నష్టపరిహారం ఇవ్వాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రాంతీయ రింగు రోడ్డు నిర్మాణం అవుతున్న గ్రామాల్లో భూముల విలువను మూడు రెట్లు పెంచింది. కనిష్ఠంగా ఎకరాకు రూ.4.25 లక్షలు ఉన్న విలువను రూ.16.50 లక్షలకు పెంచింది. రూ.7 లక్షలకు పైగా ఉన్న చోట రూ.20 లక్షల వరకు మార్కెట్ విలువను పెంచింది. వాటి వివరాలను ధరణి వెబ్‌సైట్‌లో అధికారులు పొందుపరిచారు. కేంద్ర ప్రభుత్వ అధికారులకు సైతం రాష్ట్ర ప్రభుత్వం పెరిగిన విలువల నివేదికను అందజేశారు. వారి నుంచి స్పష్టత రాగానే ఎంత చెల్లించాలనే విషయమై కొలిక్కి వస్తుందని అధికారులు భావిస్తున్నారు.

- ట్రిపుల్‌ఆర్ భూనిర్వాసితులకు విలువ పెంచి అందించేందుకు చర్యలు
- ఉమ్మడి మెదక్ జిల్లాలో 4,500 ఎకరాల రైతులకు మేలు

110 కిలోమీటర్లు.. 4,500 ఎకరాలు

ప్రాంతీయ రింగు రోడ్డు నిర్మాణంలో ఉమ్మడి మెదక్ జిల్లాలో ఉత్తర భాగంలో సంగారెడ్డి, నర్సాపూర్, తూప్రాన్, గజ్వేల్, జగదేవపూర్ మండలం వరకు 110 కిలో మీటర్ల పరిధిలో 4,500 ఎకరాల భూమి అవసరం ఉంటుందని అధికారులు అంచనా వేశారు. భూముల సర్వేను పూర్తి చేసి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికలను సిద్ధం చేశారు. కొన్ని సమస్యాత్మక గ్రామాల్లో క్షేత్రస్థాయిలో అధికారులు సర్వేలు, రికార్డులను పరిశీలిస్తున్నారు.

కొనసాగుతున్న ఆందోళనలు

ప్రాంతీయ రింగు రోడ్డు నిర్మాణం కానున్న పలు గ్రామాల్లో రైతులు భూనిర్వాసితులు ఆందోళన కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. ప్రధానంగా హెచ్ఎండీఏ పరిధిలోని నర్సాపూర్, తూప్రాన్, గజ్వేల్ డివిజన్ల పరిధిలోని గ్రామాల్లో ఎకరాకు ఎక్కడా రూ.కోటికి తక్కువ లేదు. కొన్ని చెరువులు, కుంటల సమీపంలోని గ్రామాల్లోనూ ఎకరాకు రూ.40 లక్షలపైన ఉంది. మార్కెట్ విలువల ఆధారంగా తమకు నష్టపరిహారం ఇవ్వాలని ఆందోళనలు చేస్తున్నారు. అధికారులకు వినతిపత్రాలు అందిస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విలువలపై మూడు రెట్లు ఇస్తేనే మార్కెట్ ధర పరిహారం వస్తుందని భూయజమానులు భావిస్తున్నారు.



భూయజమానులతో చర్చిస్తున్న ఆర్డీఓ

ఎవరూ ఆందోళన చెందొద్దు

తూప్రాన్ డివిజన్ పరిధిలో ప్రాంతీయ రింగు రోడ్డు నిర్మాణానికి సంబంధించిన నివేదికలను రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించాం. గతంలో మార్కెట్ విలువను రాష్ట్ర ప్రభుత్వానికి పంపించగా పెంచారు. ధరణిలో నమోదై ఉంది. వీలైనంత మేర ఎక్కువ పరిహారం అందించేందుకు చొరవ తీసుకుంటున్నాం. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

జయచంద్రారెడ్డి, ఆర్డీవో తూప్రాన్

రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలి:



రాష్ట్ర ప్రభుత్వం పాంతీయ రింగు రోడ్డు నిర్మాణంలో విలువైన భూములు కోల్పోతున్న విషయాన్ని గుర్తించి మార్కెట్ విలువలను పెంచడం సంతోషకరం. పెంచిన విలువ ఆధారంగానే భూనిర్వాసితులకు తగిన పరిహారం అందేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవాలి. అప్పుడే న్యాయం జరుగుతుంది. సక్రు, ఎల్లారెడ్డి గూడెం తండా

న్యాయం జరిగే వరకు పోరాటం:



ప్రాంతీయ రింగు రోడ్డు నిర్మాణంలో విలువైన భూములు కోల్పోతున్నాం. ప్రస్తుతం ఉన్న విలువల ప్రకారం తక్కువ పరిహారం వస్తుంది. మార్కెట్ ధర ప్రకారం ఇవ్వాలి. లేదంటే మాకు న్యాయం జరిగే వరకు పోరాటాన్ని కొనసాగిస్తునే ఉంటాం. ఇప్పటికే మా గ్రామంలో కాళేశ్వరం ప్రాజెక్టుకు భూములు కోల్పోయాం. యాదయ్య, రెడ్డిపల్లి

దేశభక్తి గుర్తింపు.. పోటీలతో పెంపొందు

మెదక్ టౌన్, న్యూస్‌టుడే: విద్యార్థి దశ నుంచే దేశభక్తిని పెంపొందించడానికి దేశం కోసం ప్రాణాలర్పించిన వీరుల గాథలు తెలియజేయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక పోటీలను నిర్వహిస్తోంది. రక్షణ, విద్యా మంత్రిత్వ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో 2024-25 విద్యా సంవత్సరానికి 'వీర్‌గాథ-4.0' పేరుతో వీటిని చేపట్టింది. ఇప్పటికే దృశ్యశ్రవణ సమావేశం ద్వారా సూచనలు చేశారు. ముందుగా వెబ్‌సైట్‌లో పోటీల్లో పాల్గొనే విద్యార్థుల వివరాలు నమోదు చేయాలి. 3 నుంచి 5వ తరగతి విద్యార్థులు 150 పదాలకు మించకుండా 'నా రోల్ మోడల్' శీర్షికతో గ్యాలెంట్రీ అవార్డు పొందిన దేశభక్తుడి గురించి వ్యాసం రాయడం లేదా డ్రాయింగ్ వేయాల్సి ఉంటుంది. 6-8వ తరగతి విద్యార్థులు గ్యాలెంట్రీ అవార్డు పొందిన వారి త్యాగం గురించి 300 పదాలకు మించకుండా వ్యాసం లేదా డ్రాయింగ్ లేదా మల్టీ మీడియా ప్రదర్శన ఇవ్వాలి. 9-10వ తరగతి వారు 'రాణీ లక్ష్మీబాయి కలలోకి వస్తే', 'నీవు దేశ సేవ ఎలా చేస్తావు' అనే అంశంతో 750 పదాల వ్యాసం లేదా డ్రాయింగ్, మల్టీమీడియా ప్రదర్శన చేయాల్సి ఉంటుంది. ఇంటర్ విద్యార్థులు స్వాతంత్ర్య ఉద్యమంలో 1857 తిరుగుబాటులో ప్రేరేపించిన అంశంపై వెయ్యి పదాల్లో వ్యాసం లేదా చిత్రలేఖనం పోటీలు ఉంటాయి.



వీర్‌గాథ-4.0 పేజీ

సూపర్ 100 మంది విజేతలయ్యే తీరు

- జిల్లా స్థాయిలో నలుగురిని ఎంపిక చేస్తారు.
- రాష్ట్ర స్థాయిలో 8 మంది విజేతలు
- జాతీయ స్థాయికి 100 మంది ఎంపికవుతారు.
- 3వ తరగతి నుంచి 5 వరకు.. 6 నుంచి 8 వరకు.. 9, 10 తరగతుల నుంచి.. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల నుంచి 25 మంది చొప్పున మొత్తం 100 మంది ఎంపికవుతారు.
- నగదు బహుమతి రూ.10 వేల చొప్పున ఒక్కొక్కరికి ఇస్తారు.
- పోర్టల్‌లో నమోదుకు గడువు అక్టోబరు 15
- వెబ్‌సైట్ mygov.in పేజీలో 'వీర్‌గాథ' ఆప్షన్ క్లిక్ చేసి వివరాలు నమోదు చేయాలి.
- 17వ తేదీ నుంచి నవంబర్ 10 వరకు జిల్లా స్థాయి, నవంబర్ 12 నుంచి 30 మధ్య రాష్ట్ర స్థాయి, డిసెంబర్ 4-24 మధ్య జాతీయ స్థాయి పోటీలుంటాయి.

సద్వినియోగం చేసుకోవాలి:



జాతీయ స్థాయిలో విద్యార్థుల గుర్తింపు దక్కించుకునేందుకు ఇది చక్కని అవకాశం. పోటీలకు ఎక్కువ దరఖాస్తులు వచ్చేలా కృషి చేస్తున్నాం. సెలవుల అనంతరం పాఠశాలలు ప్రారంభం కాగానే అధిక సంఖ్యలో నమోదు జరిగేలా చూస్తాం. సుదర్శనమూర్తి, జిల్లా సెక్టోరల్ అధికారి, మెదక్

రైతులకు పంట రుణాలు అందించాలి: సీపీఎం

సిద్దిపేట అర్బన్, న్యూస్‌టుడే: రుణమాఫీ పూర్తయిన రైతులకు తిరిగి వెంటనే రుణాలు అందించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్క రాములు డిమాండ్ చేశారు. సిద్దిపేటలో ఆదివారం పార్టీ సిద్దిపేట జిల్లా కమిటీ సమావేశం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కాముని గోపాలస్వామి అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన రాములు మాట్లాడుతూ.. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి పది నెలలు కావొస్తున్నా రుణమాఫీ హామీ పూర్తికాలేదని, మాఫీ అయినా చాలా మందికి రుణాలు ఇవ్వడం లేదన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రాళ్లబండి శశిధర్, సందెబోయిన ఎల్లయ్య, శెట్టిపల్లి సత్తిరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వనదుర్గ వర్చస్సు.. భక్తులకు ఉషస్సు



రాజరాజేశ్వరీదేవిగా వనదుర్గ



అమ్మవారి పల్లకీ సేవ

పాపన్నపేట, న్యూస్‌టుడే: శరన్నవరాత్రోత్సవాల ముగింపు సందర్భంగా శనివారం ఏడుపాయల ఆలయంలో విశేష పూజలు, అలంకరణ నిర్వహించారు. దసరా పండుగ సందర్భంగా భక్తుల సందర్శనలతో కిటకిటలాడింది.. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల వనదుర్గామాత ఆలయం వద్ద నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. గోకుల్‌షెడ్‌లో ఏర్పాటు చేసిన అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో ఊరేగింపుగా తీసుకు వచ్చి ఆలయం ముందు ఉన్న నదీపాయ వద్ద మంజీరా మార్జనం కార్యక్రమం నిర్వహించారు. దసరా పండుగ సందర్భంగా వనదుర్గను రాజరాజేశ్వరీదేవిగా అలంకరించారు. భక్తుల రాకతో ఆలయ పరిసరాలు అమ్మనామస్మరణతో మార్మోగాయి. వాహన పూజలు అధికంగా జరిగాయి.

దేవీ దర్శనం.. మనసు తన్మయత్వం



న్యూస్‌టుడే, గజ్వేల్ గ్రామీణ: ఉత్సవాల చివరి రోజున వర్గల్ విద్యాసరస్వతి అమ్మవారు రాజరాజేశ్వరి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. శనివారం తెల్లవారుజామున వ్యవస్థాపకుడు యాయవరం చంద్రశేఖర శర్మ ఆధ్వర్యంలో విశేష పంచామృత అభిషేకం నిర్వహించారు. ఉదయం 8 గంటలకు శమీ పూజ అనంతరం అమ్మవారు సకల జయాలు సిద్ధింప చేసే రాజరాజేశ్వరి మాతగా భక్తులకు దర్శనమివ్వడంతో తన్మయత్వం చెందారు. స్థానిక వెంకటేశ్వర ఆలయంలో శ్రవణా నక్షత్రం పురస్కరించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

త్రిరాత్రోత్సవం సంపూర్ణం



కొమురవెల్లిలో త్రిశూల స్నానం

చేర్యాల, ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయంలో త్రిరాత్రోత్సవాలు ఆదివారం వైభవంగా ముగిశాయి. దుర్గాదేవి ఉత్సవాలలో భాగంగా ఆలయంలో ప్రతి ఏటా త్రిరాత్రోత్సవాలలో భాగంగా దుర్గామాతను ప్రతిష్ఠించడం ఆనవాయితీ. ఆదివారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన దుర్గామాత విగ్రహంతో ఊరేగింపు నిర్వహించారు. కోనేరులో అర్చకులు త్రిశూలస్నానం చేశారు. ప్రధానార్చకుడు మహదేవుని మల్లికార్జున్, స్థానాచారి పి.మల్లయ్య, ఏఈవో బుద్ధి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఈశ్వరుడే ఈశ్వరి రూపం



జిన్‌గుర్తిలో..

తాండూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ఈశ్వరుడు, ఈశ్వరిని వేర్వేరుగా కాకుండా ఒక్కటిగా నిర్వాహకులు అలంకరించారు. భక్తులు దర్శించుకున్నారు. వికారాబాద్ జిల్లా తాండూరు మండలం జిన్‌గుర్తి రామలింగేశ్వరస్వామిని రాజరాజేశ్వరీదేవిగా అలంకరించారు.

అమ్మ రావాలి.. ఆకలి తీర్చాలి

ఏ ప్రాణయినా తన పిల్లల కడుపు నింపేందుకు పోరాటం చేస్తుంది. కొన్ని స్వయంగా ఆహారం అందిస్తుంటే, మరికొన్ని సేకరించి మరీ అందిస్తాయి. మెదక్ జిల్లా తూప్రాన్‌లోని ఓ వెంచర్‌లో చిన్న చెట్టుపై ఓ పక్షి గూడు పెట్టింది. అందులో రెండు పిల్లలు ఉండగా, వాటికి ఆహారం తెచ్చేందుకు తల్లి పక్షి ఎటో వెళ్లింది. ఆ సమయంలో పిల్ల పక్షులు ఆకలేసి అరుస్తుండగా 'న్యూస్‌టుడే' కెమెరా క్లిక్‌మనిపించింది. కాసేపటికి తల్లి పక్షి ఆహారం తీసుకురాగా పిల్లలు అరుపులు మానేశాయి. న్యూస్‌టుడే, తూప్రాన్



ఉత్సవాల్లో అపశ్రుతి

విద్యుదాఘాతంతో ప్రాణాలు కోల్పోయిన బాలిక



కీర్తన్య

అక్కన్నపేట(హుస్నాబాద్ గ్రామీణం), న్యూస్‌టుడే: దేవీ నవరాత్రి ఉత్సవాల్లో అపశ్రుతి చోటుచేసుకుంది. నిమజ్జనానికి దుర్గామాతను ఊరేగిస్తుండగా విద్యుదాఘాతానికి గురై బాలిక శిక కీర్తన్య(8) దుర్మరణం చెందింది. ఈ విషాద ఘటన సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం పోతారం(జె) గ్రామంలో జరిగింది. దసరా పండగ పూట గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది. ఎస్ఐ విజయభాస్కర్ తెలిపిన వివరాలు గ్రామానికి చెందిన తిరుపతి, మౌనిక దంపతులకు కూతురు కీర్తన్యతో పాటు కుమారుడు ఉన్నారు. వారిది వ్యవసాయ కుటుంబం. గ్రామంలో ఒక దుర్గామాత విగ్రహాన్ని శనివారం రాత్రి ఊరేగించారు. డీజేతో నృత్యాలు చేస్తుండగా చూసేందుకు గ్రామస్థులు తరలివచ్చారు. డీజే పరికరాలకు ఉపయోగించిన తీగ కొంచెం తెగిపోయి నేలపై పడి ఉంది. ఎవరూ గమనించలేదు. ఇంతలో బాలిక కీర్తన్య వచ్చి ఆ తీగపై అడుగేయగా విద్యుదాఘాతానికి గురై కింద పడిపోయింది. గమనించిన స్థానికులు వైరును తొలగించారు. బాలికను నంగునూరులోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. తర్వాత సిద్దిపేటలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే పరిస్థితి విషమించి మృతి చెందింది. చలాకీగా ఆడుతూ పాడుతూ ఉండే బాలిక మృతి చెందడంతో తల్లిదండ్రులు తట్టుకోలేకపోతున్నారు. ఘటనా స్థలాన్ని ఎస్ఐ విజయభాస్కర్, విద్యుత్తు సిబ్బంది సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. తిరుపతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

పండక్కి వస్తూ.. రోడ్డు ప్రమాదంలో దుర్మరణం



మొగులప్ప

బొంరాస్‌పేట, న్యూస్‌టుడే: హైదరాబాద్-బీజాపూర్ రహదారిపై బుర్రితండా సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. ఎస్సై అబ్దుల్ రవూఫ్ తెలిపిన వివరాలు.. నారాయణపేట జిల్లా మద్దూరు మండలం చింతల్‌దిన్నెకు చెందిన మొగులప్ప(40) హైదరాబాద్‌లో మేస్త్రీ పనులు చేస్తుంటాడు. ఆదివారం పండుగ కోసం బైకుపై స్వగ్రామానికి వెళ్తుండగా.. బుర్రితండా సమీపంలో ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. మొగులప్ప అక్కడికక్కడే మృతి చెందాడు. తండ్రి ఆశప్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మొగులప్పకు భార్య, కొడుకు, కూతురు ఉన్నారు.

మొక్కజొన్న పొలానికి కాపలా వెళ్లిన రైతు..

పెద్దేముల్, న్యూస్‌టుడే: పొలం వద్ద కాపలాకు వెళ్లిన వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్ర గాయాలై మృతి చెందాడు. ఈ ఘటన వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండలంలోని గోపాల్‌పూర్ గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. ఎస్ఐ గిరి తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన పెద్దకురువ బాలప్ప (38) శుక్రవారం రాత్రి తన మొక్కజొన్న పొలానికి వెళ్లాడు. అర్ధరాత్రి 12.30 గంటల ప్రాంతంలో రోడ్డు పక్కన రక్తపు మడుగులో పడి ఉన్నట్లు గ్రామానికి చెందిన వ్యక్తి గమనించి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. వారు ఘటనా స్థలానికి చేరుకొని చికిత్స నిమిత్తం తాండూరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే బాలప్ప చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. భార్య అంజిలమ్మ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

మద్యం మత్తులో గొడవ.. స్నేహితుడి దారుణ హత్య



నదీమ్

షాపూర్‌నగర్, న్యూస్‌టుడే: మద్యం మత్తులో గొడవ పడిన కొందరు యువకుడిని దారుణంగా హత్య చేసిన ఘటన జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ నర్సింహ తెలిపిన వివరాల ప్రకారం... సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం బుధేర గ్రామానికి చెందిన అక్బర్‌పాషా, షాహిన్‌బేగం దంపతులు 40 ఏళ్ల క్రితం ఉపాధి నిమిత్తం నగరానికి వలస వచ్చి జగద్గిరిగుట్ట పరిధి దీనబంధు కాలనీలో నివాసముంటున్నారు. కుమారుడు నదీమ్(21). అక్బర్ పాషా మసీదులో పనిచేస్తున్నాడు. తరచూ స్నేహితులతో గొడవపడేవాడు. ఆదివారం రాత్రి తన మిత్రుడి జన్మదిన వేడుకలకు వెళ్లి మద్యం తాగాడు. రోడ్డుపై స్నేహితులతో కలిసి గొడవ పడడంతో పోలీసులు వచ్చి వారికి సర్దిచెప్పి ఇంటికి పంపించారు. అనంతరం కొంతమంది నదీమ్ ఇంటికి వెళ్లి బయటకు పిలిచి గొడవపడ్డారు. ఘర్షణ పెద్దది కావడంతో ఇనుపరాడ్‌తో నదీమ్ తలపై కొట్టడంతో కుప్పకూలాడు. రక్తపు మడుగులో ఉన్న అతడిని పోలీసులు గాంధీ ఆసుపత్రికి తరలించారు. సోదరి ఫిర్యాదు మేరకు అనుమానితుడు ఖలీల్‌తోపాటు మిగతా వారి కోసం గాలిస్తున్నట్లు సీఐ తెలిపారు.

బలవన్మరణం.. కుటుంబాలు అతలాకుతలం

సమస్యలను అధిగమిస్తూ జీవనాన్ని ముందుకు తీసుకెళ్లాల్సిన వ్యక్తులు కొందరు బాధలను భరించలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఆయా కుటుంబాల్లో విషాదం నింపుతున్నారు. మెదక్, సిద్దిపేట జిల్లాల్లో ముగ్గురు పండుగ రోజుల్లో బలవన్మరణానికి పాల్పడ్డారు. కుటుంబ సభ్యులకు తీరని దుఃఖం మిగిల్చారు.

పెళ్లి కావడం లేదని.. యువకుడి ఆత్మహత్య



అనిల్

మనోహరాబాద్, న్యూస్‌టుడే: పెళ్లి కుదరడం లేదని అనారోగ్యంతో బాధపడుతున్న యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మెదక్ జిల్లా కాళ్లకల్‌లో చోటుచేసుకుంది. ఎస్ఐ సుభాష్‌గౌడ్ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన వీరబోయిన భాస్కర్‌కు ఇద్దరు కుమారులున్నారు. చిన్నకుమారుడు అనిల్ (28)కు పెళ్లి సంబంధాలు చూస్తున్నా కుదరటం లేదు. తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. గతంలో ఓ ప్రమాదంలో పైనుంచి కింద పడగా ఒక మూత్రపిండం తొలగించారు. తరచుగా అనారోగ్యానికి గురవుతుండటంతో జీవితంపై విరక్తి చెంది శుక్రవారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకున్నాడు. తల్లిదండ్రులు గమనించి మేడ్చల్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేశారు.

మద్యం తాగొద్దన్నందుకు డ్రైవర్..

రామాయంపేట, న్యూస్‌టుడే: మద్యం తాగడం మానివేయాలని కుటుంబ సభ్యులు సూచించడంతో.. ఓ వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం చోటు చేసుకుంది. ఎస్సై సాయిరెడ్డి వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం ముత్యంపేటకు చెందిన మారగాని రాజు(32) జీవనోపాధి కోసం గుండ్లపోచంపల్లిలో ఆరు నెలలుగా కుటుంబంతో సహా నివాసం ఉంటున్నాడు. ఆటో నడపడంతో పాటు కూలీ పనులు చేస్తున్నాడు. మద్యం తాగుతుండటంతో ఇంట్లో గొడవలు జరిగేవి. ఈ విషయమై మరోమారు గొడవ జరగడంతో ఆటోలో రామాయంపేట మండలం అక్కన్నపేటకు వచ్చి.. ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య పావని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతునికి ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నాడు.

అలవాటు మానలేక మెకానిక్ ..

హుస్నాబాద్, న్యూస్‌టుడే: మద్యం తాగడం మానేసేందుకు చికిత్స తీసుకున్నా .. అలవాటు మానక దానికి బానిసైన వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో జరిగింది. ఎస్ఐ మహేశ్ తెలిపిన వివరాలు.. స్థానికంగా ద్విచక్ర వాహన మెకానిక్ దగ్గర పని చేసిన నమిలికొండ రాజేందర్ (43)కు భార్య రమాదేవి, కుమార్తె ఉన్నారు. గత కొంతకాలంగా రాజేందర్ మద్యానికి బానిసయ్యాడు. చికిత్స కేంద్రం నుంచి తిరిగి వచ్చి మళ్లీ తాగుతున్నాడు. శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకున్నాడు. భార్య ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అదృశ్యమై.. విగతజీవిగా మారి..



మోహన్

నర్సాపూర్, న్యూస్‌టుడే: ఇంటి నుంచి అదృశ్యమైన వ్యక్తి విగతజీవిగా మారిన ఘటన నర్సాపూర్ పట్టణంలో శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. ఎస్సై లింగం తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీకి చెందిన ఒంటెద్దు(మందుల) మోహన్(35) ఈనెల 10వ తేదీన పనిపై బయటకు వెళ్లాడు. రాత్రికి ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో మరుసటి రోజు మోహన్ అదృశ్యమైనట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. శనివారం సాయంత్రం నర్సాపూర్‌లోని పందివాగులో మృతదేహం ఉందని పోలీసులకు సమాచారం అందింది. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహం మోహన్‌దిగా గుర్తించారు. అతడి భార్య సంగీత ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మోహన్ స్థానికంగా ప్లాస్టిక్ వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు.

ప్రదర్శన వైవిధ్యం.. అవగాహన అనునిత్యం

- ఉత్తరాది ప్రజల శైలిపై అధ్యయనంతో విద్యార్థులకు ప్రయోజనం

న్యూస్‌టుడే, హుస్నాబాద్, హుస్నాబాద్ గ్రామీణం

దేశంలో అన్ని రాష్ట్రాల ప్రజల సంస్కృతి, సంప్రదాయాలు ఒకే విధంగా ఉండవు. తెలుగు రాష్ట్రాలతో పోల్చితే ఈశాన్య రాష్ట్రాలు, ఉత్తర భారత దేశంలోని రాష్ట్రాల్లోనివి భిన్నంగా ఉంటాయి. వీటన్నింటిపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఉన్నత విద్యాశాఖ ఇటీవల 'భారతీయ కళా మహోత్సవ్' పేరిట ప్రత్యేకంగా కార్యక్రమం నిర్వహించింది. హుస్నాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ విజయగిరి బిక్షపతి ఆధ్వర్యంలో హైదరాబాద్ బొల్లారం రాష్ట్రపతి నిలయానికి వెళ్లారు. ఈనెల 6 వరకు మొత్తం తొమ్మిది రోజుల పాటు ప్రదర్శనలు నిర్వహించారు. అక్కడి ప్రజల జీవన విధానం, సంస్కృతి, సంప్రదాయాలు, పద్ధతులను తెలిపే స్టాళ్లు ఏర్పాటు చేశారు. సిద్దిపేట జిల్లాలోని హుస్నాబాద్, గజ్వేల్, దుబ్బాక, చేర్యాల, సిద్దిపేటలోని డిగ్రీ కళాశాలలకు చెందిన 100 మంది విద్యార్థులు ఈ నెల 5న సందర్శించారు.



ఈశాన్య రాష్ట్ర వాసులతో విద్యార్థులు



అక్కడి ప్రజలు ధరించే టోపీలు

పుస్తకాల్లో చదివినవి ప్రత్యక్షంగా చూశా

– గడిపె సుజిత్, బీకాం ద్వితీయ

ఈ ప్రదర్శన చాలా బాగుంది. వివిధ రాష్ట్రాల్లోని ప్రజల సంస్కృతి, సంప్రదాయాలు, జీవన విధానం గురించి తెల్సుకున్నా. తెలుగు ప్రజలతో పోల్చితే వారి జీవన విధానం, పద్ధతులు, తీసుకునే ఆహారం తదితర అంశాలు పూర్తిగా భిన్నంగా ఉన్నాయి. పుస్తకాల్లో చదివిన విషయాలను ప్రత్యక్షంగా చూసి తెలుసుకున్నా. అవకాశం కల్పించిన ప్రిన్సిపల్‌కు కృతజ్ఞతలు.

నల్లటి బియ్యంతో అన్నం

– చెన్నూరి జ్యోతి, బీజడ్‌సీ ద్వితీయ

రాష్ట్రపతి నిలయంలో వివిధ రాష్ట్రాల గురించి తెల్సుకున్నా. అందులో ఉత్తర భారతంలోని రాష్ట్రాల ప్రజల జీవన విధానం, పద్ధతులు, ఆహారపు అలవాట్లు, కళలు, నృత్యాలు ప్రదర్శించారు. వంట పాత్రలు కలపతో చేసినవి ఉంటాయి. బియ్యంతో చేసిన అన్నం తినడం తక్కువ. నల్లటి బియ్యాన్ని సొంతంగా పండించుకొని వాటినే అన్నం చేసుకొని భోంచేస్తారు. చపాతీల వాడకం ఎక్కువ.

కర్రలు, గడ్డితో ఇళ్లు

– ఎండీ సమీనా, బీఏ ద్వితీయ

ఈశాన్య రాష్ట్రాల ప్రజల ఇళ్లు, ఉపయోగించే వివిధ రకాల పరికరాలు, దుస్తుల గురించి తెల్సుకున్నా. కర్రలు, గడ్డితో నిర్మించిన ఇళ్లలో అక్కడి ప్రజలు నివసిస్తున్నారు. వారి భాష భలేగా ఉంది. విభిన్న సంస్కృతుల గురించి తెలుసుకోవడం కొత్త అనుభూతి కలిగింది.

ప్లాస్టిక్ గ్లాసులు లేవు

– జక్కు క్రాంతి, బీఎస్సీ తృతీయ

అధ్యాపకుడు చుక్క రమేశ్‌తో కలిసి వెళ్లాం. ఈశాన్య రాష్ట్రాల ప్రజల జీవనశైలి విభిన్నంగా ఉంటుందని తెలుసుకున్నా. ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు వాడరు. లోహం, కలప, చెట్టు భాగాలతో చేసినవి వినియోగిస్తారు. నీళ్లను కర్ర పాత్రలో నుంచి తాగుతారు. బంగారం, వెండి ఆభరణాలు వేసుకోవడం తక్కువ. పూసలు, దారాలు, కర్రతో తయారు చేసిన ఆభరణాలు ధరిస్తారు. నృత్యాలు విభిన్నం.

స్నానానికి వెళ్లి.. నీట మునిగి ఇద్దరు మృతి



సంగెం విఠల్

పుల్కల్, బషీరాబాద్, న్యూస్‌టుడే: వేర్వేరు ఘటనల్లో స్నానానికి దిగి ప్రమాదవశాత్తు నీట మునిగి ఇద్దరు మృతి చెందారు. సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండల పరిధిలోని సింగూరు ప్రాజెక్టు వద్ద ఘటన జరిగింది. ఎస్ఐ పాటిల్ క్రాంతికుమార్ తెలిపిన వివారాలు.. సింగూరు గ్రామానికి చెందిన సంగెం విఠల్ (40) వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ జీవనం గడుపుతున్నాడు. అతడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈనెల 11న ప్రాజెక్టు దిగువ భాగాన స్నానం చేయడానికి దిగి మునిగిపోయాడు. ఆ సమయంలో ప్రాజెక్టు ఒక గేటు ఎత్తి నీటి విడుదల కొనసాగుతుండడంతో పాటు జల విద్యుత్తు కేంద్రం ద్వారా నీరు దిగువకు వెళుతోంది. సమాచారం తెలిసిన వెంటనే అధికారులు నీటి విడుదలను నిలిపివేశారు. పోలీసులు గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. శనివారం విఠల్ ఆచూకీ లభించలేదు. ఆదివారం ఉదయం గేట్ల వద్ద మృతదేహం కనిపించింది. భార్య మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

- వికారాబాద్ జిల్లా బషీరాబాద్ ఎస్ఐ గఫార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రెడ్డిఘనాపూర్‌కు చెందిన అశోక్ (38) వ్యవసాయ కూలీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. దుర్గామాత ఉత్సవాలు ముగిసిన తర్వాత ఆదివారం అక్కడే చెరువులో ఈతకు వెళ్లాడు. ఈదుతుండగా బురదలో ఇరుక్కుపోయి మృతి చెందాడు. అక్కడే ఉన్న కొందరు వెతికి తీసేసరికి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

చికెన్ ధరలు		
ఫాంరేటు 126-00	డ్రెస్డ్ 215-00
రిటైల్ 148-00	స్కిన్‌లెస్ 244-00

నారాయణఖేడ్‌లో అలయ్ బలయ్

నారాయణఖేడ్: ఖేడ్‌లోని జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు భూపాల్‌రెడ్డి, విజయపాల్‌రెడ్డి, ప్రవాస భారతీయుడు గుర్రపు మశ్చేందర్ ఆదివారం ఖేడ్‌లో అలయ్ బలయ్ నిర్వహించారు. నియోజకవర్గంలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఎంపీ సురేష్‌షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డిలతోపాటు నగేష్‌షెట్కార్, శ్రీనివాస్, రాకేష్‌షెట్కార్, సాగర్‌షెట్కార్, చంద్రశేఖర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డిలను కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపారు.

నేడు చౌటకూరు మండలం తాడ్దాన్‌పల్లిలో...

జోగిపేట, న్యూస్‌టుడే: చౌటకూరు మండలం తాడ్దాన్‌పల్లి శివారు కల్యాణ మండపంలో సోమవారం కాంగ్రెస్ తరఫున అలయ్ బలయ్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆ పార్టీ వర్గాలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపాయి. మంత్రి దామోదర్ రాజనర్సింహ హాజరవుతారని పేర్కొన్నారు.

జోగిపేట టౌన్: సంగుపేట శివారులో సోమవారం నిర్వహించే 'అలయ్-బలయ్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని భారాస మండల అధ్యక్షుడు లక్ష్మీకాంత్‌రెడ్డి కోరారు. ఆదివారం ఏఎంసీ మాజీ ఛైర్మన్ డీబీ నాగభూషణం, భారాస నాయకులతో కలిసి ఏర్పాట్లు పరిశీలించారు.

మాజీ మంత్రిని కలిసిన ఐడీఏ బొల్లారం నేతలు


హరీశ్‌రావుకు పుష్పగుచ్ఛం ఇస్తూ..

జిన్నారం: మాజీ మంత్రి హరీశ్‌రావును ఆదివారం జిన్నారానికి చెందిన భారాస నాయకులు కలిశారు. ఈ మేరకు పుష్పగుచ్ఛం ఇచ్చి ఘనంగా సత్కరించారు. హరీశ్‌రావును కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపినట్లు మాజీ జడ్పీటీసీ బాల్‌రెడ్డి, సాయికిరణ్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి పేర్కొన్నారు.

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డికి సన్మానం

జిన్నారం, గుమ్మడిదల, న్యూస్‌టుడే: దసరా పర్వదినం నేపథ్యంలో జిన్నారం, గుమ్మడిదల పార్టీ శ్రేణులు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ఆదివారం కలిసి సత్కరించారు. తరువాత నియోజకవర్గ ఇన్‌ఛార్జి కాట శ్రీనివాస్‌గౌడ్‌ను, ఎన్ఎంఆర్ అధినేత నీలం మధును కలిసి శుభాకాంక్షలు చెప్పారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

సిద్దిపేట టౌన్: అనుమానాస్పద వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలని సిద్దిపేట టూటౌన్ సీఐ ఉపేందర్ సూచించారు. యువత గంజాయి, ఇతర మత్తుపదార్థాల జోలికి వెళ్లకుండా చదువులపై దృష్టి సారించాలన్నారు. కేసీఆర్ నగర్‌లో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు.

భవనాలున్నా... నిరుపయోగం


ఖేడ్‌లో వినియోగించని దుకాణాల సముదాయం

న్యూస్‌టుడే, నారాయణఖేడ్:

నారాయణఖేడ్ పట్టణంలో పలు ప్రభుత్వ భవనాలు నిరుపయోగంగా మారాయి. కొన్ని కార్యాలయాలకు పక్కాభవనాలు లేక అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. నిరుపయోగంగా ఉన్న భవనాల్లోకి ఆయాకార్యాలయాలను మారిస్తే ప్రభుత్వానికి అద్దెభారం తగ్గి ఉపయుక్తంగా ఉంటుంది. ఖేడ్‌లో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 17 ఏళ్లకిందట షెడ్యూల్డ్ కులాల సేవా సహకార అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్మించిన నాలుగు షట్టర్లు నిరుపయోగంగానే మారాయి. రద్దీప్రాంతంలో ఉండే వీటిని ప్రైవేటువారికి అద్దెకుఇస్తే నెలకు కనిష్ఠంగా రూ.30 వేల వరకు ఆదాయం సమకూరే అవకాశాలున్నా... ఆ దిశగా చర్యలు కరవయ్యాయి.

సామాజికభవనాలు ఇలా..

ఖేడ్‌లో గృహ నిర్మాణశాఖ ద్వారా పదేళ్లకిందట మాడల్‌హౌజ్‌ను నిర్మించారు. భారాస అధికారంలోకి వచ్చాక గృహ నిర్మాణ శాఖను రద్దుచేసి రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణాలను చేపట్టడంతో మాడల్‌హౌజ్ భవనం నిరుపయోగంగా ఉంది. 2015-16 ఆర్థిక సంవత్సరంలో ప్రత్యేకఅభివృద్ధి నిధులకింద హట్కర్, ఆర్యవైశ్య, సగర సంఘభవనాలతోపాటు మార్కండేయ(పద్మశాలి భవనం) భవన నిర్మాణాలకు రూ.55 లక్షలు మంజూరు చేశారు. ఆయా భవనాల నిర్మాణాలు పూర్తయ్యాయి. అందులో మార్కండేయ భవనం మినహా మిగతా భవనాలను ప్రారంభించకపోవడంతో నిరుపయోగంగానే ఉన్నాయి.

అద్దెభవనాల్లో ఇవీ..

ఖేడ్‌లో కార్మికశాఖ సహాయ అధికారి, సాంఘీక సంక్షేమశాఖ సహాయ అధికారి కార్యాలయాలు, సాంఘీకసంక్షేమ బాలికల వసతిగృహం అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ఆయావాటికి అద్దెగా నెలకు రూ.లక్ష వరకు చెల్లిస్తున్నారు. వీటికితోడు ఉప కోశాధికారి కార్యాలయాన్ని శిథిలభవనంలోనే నెట్టుకొస్తున్నారు. అగ్నిమాపక కేంద్రం ఖాళీగా ఉన్న పంచాయతీరాజ్ గోదాంలో కొనసాగిస్తున్నారు. దీంతో సదుపాయాలలేమితో సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. ఆయావాటిని నిరుపయోగంగాఉన్న ఆయా ప్రభుత్వభవనాల్లోకి మార్చితే అద్దె భారం తప్పడంతోపాటు నిరుపయోగ భవనాలు వినియోగంలోకి వస్తాయి.

మేమున్నాం.. మీకు తోడుగా..

ఫోన్ చేయాల్సిన నంబర్లు (10AM TO 1 PM) సంగారెడ్డి 8008573233, జహీరాబాద్ 9441648363, నారాయణఖేడ్ 8008573248, నారాయణఖేడ్ టౌన్ 8008573250, అందోలు 8008573241, జిన్నారం 8008573231

జోగిపేట, నారాయణఖేడ్:

? జోగిపేట పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తావద్ద సరైన వీధి దీపాలు లేకపోవడంతో రాత్రుళ్లు అంధకారం నెలకొంటుంది. దీనిమూలంగా వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. - **ప్రకాష్, జోగిపేట.**

✓ ఈ ప్రాంతంలో ఎక్కువ సంఖ్యలో వీధి దీపాల ఏర్పాటు చేయించి వాహనదారుల ఇబ్బందులు తీరుస్తాం. **-తిరుపతి, కమిషనర్, అందోలు- జోగిపేట.**

? జోగిపేట వాసవినగర్, ఇందిరానగర్ కాలనీల్లో పలుచోట్ల స్తంభాలు దారులు, మలుపుల్లో అడ్డుగా ఉన్నాయి. వాటివల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. - **ప్రశాంత్, జోగిపేట.**

✓ అలాంటి స్తంభాలు ఎక్కడున్నా గుర్తించి తొలగించి కాలనీవాసులకు ఇబ్బందులు తీరుస్తాం. - **శ్రీనివాస్, ఏఈ విద్యుత్ శాఖ అందోలు.**

? ఖేడ్ పురపాలిక పరిధిలోని మంగల్‌పేట హన్మాన్ కాలనీలో మురుగు కాల్వల నుంచి వచ్చే వరద జాతీయ రహదారిపై పారుతోంది. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. - **అజయ్, మంగల్‌పేట.**

✓ కాల్వలు చిన్నవిగా ఉండటం వల్ల సమస్య ఉత్పన్నమవుతోంది. త్వరలో విశాలమైన కాల్వలు నిర్మిస్తాం. అప్పటివరకు కాల్వలో పేరుకుపోయిన చెత్తను తొలగించి రోడ్లపైకి వరద రాకుండా చర్యలు తీసుకుంటాం. - **శ్రీనివాస్, పారిశుద్ధ్య పర్యవేక్షకులు, ఖేడ్ పురపాలిక.**

గంగమ్మ ఒడికి చేరిన దుర్గమ్మ


సదాశివపేటలో..

జిల్లాలో దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. యువకులు, పెద్దలు ఆటపాటలతో సందడి చేశారు. తదుపరి సమీపంలోని నీటి వనరుల్లో విగ్రహాలను నిమజ్జనం చేశారు.
– న్యూస్‌టుడే బృందం.


ఎద్దుమైలారంలో ఊరేగింపులో యువకులు, పెద్దలు..



ఝరాసంగం మండలం కేతకిలో...


గుమ్మడిదలలో పల్లకీసేవ...


బోరంచలో..


బొంతపల్లిలో..

కేతకిలో బీదర్ ఎమ్మెల్యే పూజలు



ఝరాసంఘం: దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన ఝరాసంగం కేతకి సంగమేశ్వర ఆలయంలో బీదర్ ఎమ్మెల్యే శైలేంద్ర ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుప్పనగర్ కృష్ణపూర్, బర్దీపూర్, ఈదులపల్లి తదితర గ్రామాల్లో దుర్గాభవానీ వేడుకల్లోనూ ఆయన పాల్గొన్నారు. ఎమ్మెల్యేను ఆలయ అర్చకులు సత్కరించి ప్రసాదం అందజేశారు

జిల్లా మహాసభలు జయప్రదం చేయండి: సీపీఎం


మాట్లాడుతున్న నాయకుడు రాంచందర్

జహీరాబాద్ అర్బన్: జహీరాబాద్ పట్టణంలో ఈనెల 19, 20వ తేదీల్లో నిర్వహించే సీపీఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం ఆహ్వాన కమిటీ ఛైర్మన్ రాంచందర్ పిలుపునిచ్చారు. పట్టణంలోని శ్రామిక్ భవన్‌లో ఆదివారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. మహాసభలకు జిల్లా నలుమూలల నుంచి పార్టీ శ్రేణులు హాజరుకావాలని కోరారు.

ఘనంగా ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు


రాయికోడ్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న సంఘ్ కార్యకర్తలు

రాయికోడ్, న్యూస్‌టుడే: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా శనివారం రాయికోడ్‌లోని శ్రీపాండురంగ దేవాలయం ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘ్ ప్రచారక్ శ్రీరాం ప్రసాద్ మాట్లాడుతూ.. నేటి యువత స్వయం సేవక్ సంఘ్ ద్వారా విపత్కర పరిస్థితుల్లో ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతుందన్నారు. యువత చరవాణి, టీవీలు చూస్తూ కాలక్షేపం చేయకుండా పార్టీలకతీతంగా హిందూ ధర్మ పరిరక్షణకు కృషి చేయాలని కోరారు.

సూచికలకే పరిమితం... ఇష్టారీతిన చెత్తాచెదారం!



అధికారులు బోర్డుల ఏర్పాటు చేయడం వరకే పరిమితం అవుతున్నారనడానికి ఈ చిత్రమే ప్రత్యక్ష నిదర్శనం. బొంతపల్లి పంచాయతీ వీరభద్రనగర్ సమీపంలో మెదక్- హైదరాబాద్ జాతీయ రహదారి పక్కనే 'చెత్త వేస్తే జరిమానా విధించబడును' అంటూ సూచిక ఏర్పాటు చేశారు. ఇదే ప్రాంతంలో చెత్త పేరుకుపోయింది. అధికారులు బోర్డు ఏర్పాటు చేయడం వరకే పరిమితమా? అంటూ స్థానికులు విమర్శిస్తున్నారు. –న్యూస్‌టుడే, గుమ్మడిదల.

ఉపాధ్యాయ కొలువులు సాధించిన వారికి సన్మానం

వెల్దుర్తి, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ ఉద్యోగాలు పొందిన తన శిష్యులను వెల్దుర్తి ఎంఈవో అరికెల యాదగిరి ఆదివారం వెల్దుర్తిలోని తన ఇంటిలో కుటుంబ సభ్యులతో కలిసి సన్మానించారు. వెల్దుర్తికి చెందిన ముల్క రవీందర్, కొల్చారం మండలం కొంగోడుకు చెందిన దంపతులు స్వప్న-శేఖర్ యాదగిరి శిష్యులు. యాదగిరి సోదరుడు ఎస్జీటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరికెల వెంకటేశం పాల్గొన్నారు.

యువకుల శ్రమదానం



జహీరాబాద్ అర్బన్: మొగుడంపల్లి మండలం గోపన్‌పల్లి వద్ద ప్రమాదకర కల్వర్టు వద్ద ముళ్ల పొదలను దసరా పండగ రోజున యువకులు తొలగించారు. గొటిగార్‌పల్లికి చెందిన నగేష్ మరో పదిమంది యువకులతో కలిసి జేసీబీ తీసుకొచ్చి ముళ్ల పొదలను తీయించివేశారు. చిన్నపాటి పిచ్చి మొక్కలను యువకులు శుభ్రం చేసి ఎదురుగా వచ్చే వాహనాలు కన్పించేలా చేయడంతో చోదకుల ఇబ్బందులు తీరిపోయాయి.

కుక్కదాడిలో చిన్నారికి గాయాలు

నారాయణఖేడ్, న్యూస్‌టుడే: కంది మండలం చాప్టా(కె)లో ఇంటిముందు ఆడుకుంటున్న చిన్నారి మల్లిక(4)పై శనివారం కుక్క దాడిచేసి చెంపపై కరిచింది. వారంరోజుల వ్యవధిలో కుక్కలు నలుగురిని కరిచాయని, వీటి బెడదను నివారించాలని గ్రామస్థులు అధికారులను కోరుతున్నారు.


సదాశివపేట: దసరా ఉత్సవాల్లో ప్రజలు



ఖేడ్‌లో ఎమ్మెల్యే సంజీవరెడ్డి..


జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు...

దేదీప్యమానంగా దసరా వేడుకలు


జోగిపేట: జోగినాథ స్వామి ఆలయం వద్ద భక్తుల బారులు..

జిల్లా వ్యాప్తంగా పట్టణాలతోపాటు పలు గ్రామాల్లో శనివారం దసరా వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయాలు సందడిగా కనిపించాయి. సాయంత్రం బాజాభజంత్రీలతో ప్రజలు ఊరేగింపుగా గ్రామ శివారు ప్రాంతాల్లోని జమ్మి వృక్షాల వద్దకు వెళ్లి పూజలు నిర్వహించారు. – న్యూస్‌టుడే బృందం.


సంగారెడ్డి: వైకుంఠపురంలో ధనుస్సు ఎక్కుపెట్టిన ప్రధాన అర్చకులు వరదాచార్యులు


జహీరాబాద్‌లో గిరిధర్‌రెడ్డికి పండగ శుభాకాంక్షలు తెలుపుతున్న అభిమానులు


జిన్నారం: దుర్గామాత ఆలయ ఆవరణలో పూజల్లో పాల్గొన్న భక్తులు


కల్హేర్: జమ్మిచెట్టువద్ద పూజల్లో మాజీ ఎమ్మెల్యేలు భూపాల్‌రెడ్డి, విజయపాల్‌రెడ్డి తదితరులు

మతిస్థిమితం లేని వ్యక్తి మద్యం తాగి మృతి

పటాన్‌చెరు అర్బన్: మతిస్థిమితం లేని వ్యక్తి మద్యం తాగి చనిపోయిన ఘటన పటాన్‌చెరు ఠాణా పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పటాన్‌చెరు మండలం ఐనోల్ గ్రామానికి చెందిన మహిపాల్ (55) దాదాపు 14 సంవత్సరాలుగా మతిస్థిమితం లేకుండా ఉండేవాడు. అప్పుడప్పుడు పటాన్‌చెరు కిందబస్తీలో ఉన్న వాళ్ల అమ్మ ఇంటికి వచ్చి వెళుతుండేవాడు. మతిస్థిమితం లేక తిరుగుతూ భిక్షాటన చేసుకుని మద్యం తాగుతూ ఉండేవాడు. ఈ నేపథ్యంలో ఆదివారం పటాన్‌చెరు శివారులో రహదారి పక్కన పడి ఉన్నాడు. కుటుంబ సభ్యులు చూసి అతడిని పటాన్‌చెరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు తెలిపారు.

బైక్ అదుపుతప్పి ఇంజినీరింగ్ విద్యార్థి దుర్మరణం

పటాన్‌చెరు అర్బన్: బీటెక్ విద్యార్థి బైక్‌పై వెళుతూ అదుపుతప్పి కిందపడి తీవ్రగాయాలై మృతిచెందిన ఘటన పటాన్‌చెరు ఠాణా పరిధిలో జరిగింది. ఎస్సై వెంకటరెడ్డి వివరాల ప్రకారం.. రామచంద్రాపురం బొంబాయి కాలనీకి చెందిన భెల్ గుత్తేదారు భూపాల్ తన కుటుంబంతో కలిసి ఈనెల 12న దసరాను పురస్కరించుకుని స్వగ్రామమైన పటాన్‌చెరు మండలం చినకంజర్ల గ్రామానికి వెళ్లారు. బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న అతడి కుమారుడు జశ్వంత్ (19) శనివారం సాయంత్రం బుల్లెట్ వాహనంపై నానమ్మ, పెదనాన్నలను కలిసి వస్తానని చెప్పి రామచంద్రాపురానికి వెళ్లాడు. అక్కడ నుంచి బంధువు రోషన్‌కు చెందిన ద్విచక్రవాహనాన్ని తీసుకుని చినకంజర్ల వెళుతున్నానని చెప్పి బయలుదేరాడు. రోషన్, అతడి స్నేహితుడు నరేష్‌కు మార్లు కలిసి దారిలో ముత్తంగి స్వీట్‌హౌట్ వద్ద టీ తాగేందుకు వస్తున్నామనీ.. బుల్లెట్ తీసుకుని వస్తున్నామని, బైక్ తిరిగి ఇద్దువు గాని అని చెప్పారు. జశ్వంత్ అక్కడకు రాకపోవడంతో ఎదురుచూసి తిరిగి వెళ్లిపోయారు. తెల్లవారు జామున పోచారం గ్రామ శివారులో జశ్వంత్ బైక్‌పై నుంచి అదుపుతప్పి పడి చనిపోయి ఉండటాన్ని గుర్తించారు. అతడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దారుల్లోనే.. ఇష్టారాజ్యం!

పారిశ్రామిక ప్రాంతాల్లో పార్కింగ్ అవస్థలు


బొంతపల్లికమాన్- జిన్నారం దారిలో అడ్డదిడ్డంగా వాహనాలు

న్యూస్‌టుడే, గుమ్మడిదల, జిన్నారం

గుమ్మడిదల, జిన్నారం మండలాల్లో సుమారు వందకుపైనే పరిశ్రమలు ఉన్నాయి. బొంతపల్లి, అన్నారం, దోమడుగు, అన్నారం, అనంతారం, గడ్డపోతారం, ఖాజీపల్లి, ఐడీఏ బొల్లారం ప్రాంతాల్లోని దారుల్లో పలు పరిశ్రమలకు చెందిన వాహనాలు ఇష్టారీతిన నిలపడంతో తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహనాలు నిలపరాదని కోరినా.. పరిశ్రమల యాజమాన్యాలు పట్టించుకోవడం లేదు. గతంలో సంబంధిత అధికారులు పలు పరిశ్రమలకు పార్కింగ్ విషయంలో తాఖీదులు ఇచ్చినా.. పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

దారుల్లోనే మురుగు!: కొన్ని ప్రాంతాల్లో పరిశ్రమలకు ముడిసరకు తీసుకొచ్చే భారీ వాహనాల నుంచి సరకుల దిగుమతి ఆలస్యం కావడంతో రోడ్డుపైనే రోజుల తరబడి పార్కింగ్ చేస్తున్నారు. మెదక్- హైదరాబాద్ జాతీయ రహదారి పక్కనే మంబాపూర్, అన్నారం గ్రామాల్లోని పలు పరిశ్రమల ఎదుట ఈ పరిస్థితి నెలకొంది. పరిశ్రమల్లో పనిచేసే కార్మికుల ద్విచక్రవాహనాలు, వారిని తీసుకొచ్చే ప్రైవేట్ బస్సులు సైతం దారుల్లోనే నిలుపుతుండటం గమనార్హం. బొంతపల్లి కమాన్ నుంచి వీరభద్రస్వామి దేవాలయం, జిన్నారానికి వెళ్లే ప్రాంతంలో నిత్యం నీటి ట్యాంకర్లు, ముడిసరకు తీసుకొచ్చే వాహనాల రాకపోకలు ఎక్కువగా ఉంటాయి. మరోవైపు రోడ్డుకు ఇరువైపుల ఉన్న హోటళ్ల నుంచి వచ్చే మురుగు రోడ్డుపైనే పారుతుండటంతో ద్విచక్రవాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఈ ప్రాంతంలో ఓ ఆటో బోల్తా పడటంతో ప్రయాణికుడు మృతిచెందారు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

జిన్నారం, గుమ్మడిదల మండలాల పరిధిలోని పరిశ్రమల ఎదుట రోడ్డుపై పార్కింగ్ చేస్తున్న యాజమాన్యాలకు గతంలో తాఖీదులు జారీ చేశాం. మరోమారు క్షేత్రస్థాయిలో పరిశీలించి తగు చర్యలు తీసుకుంటాం. పార్కింగ్ విషయంలో తగు ఏర్పాట్లు చేసుకోకుంటే జరిమానాతోపాటు కఠిన చర్యలు తీసుకుంటాం.
– దయాకర్‌రావు, ఎంపీఓ, గుమ్మడిదల.

దారులన్నీ తుల్జాపూర్ వైపే

'అమ్మ'దర్శనానికి కాలినడకన తరలుతున్న భక్తులు


మనూరు నుంచి బయలుదేరుతున్న భక్తులు

జహీరాబాద్, నారాయణఖేడ్ టౌన్, న్యూస్‌టుడే: మహారాష్ట్ర తుల్జాపూర్‌లో వెలసిన ప్రసిద్ధ తుల్జాభవాని అమ్మవారిని పున్నమిరోజు దర్శించుకునేందుకు ఈ ప్రాంతంలోని భక్తులు కాలినడకను ప్రారంభించారు. దసరా పండగను పురస్కరించుకుని తుల్జాపూర్‌లో 9 రోజుల పాటు జరిగిన ఉత్సవాలకు తెలంగాణ తోపాటు కర్ణాటక, మహారాష్ట్ర లోని వివిధ ప్రాంతాల నుంచి

కొందరు కాలినడకన, మరికొందరు ప్రత్యేక వాహనాల్లో పెద్దసంఖ్యలో భక్తులు తరలిరావడంతో 10 రోజులపాటు తుల్జాపూర్ భక్తులతో నిండిపోయింది. అయితే దసరా రోజు ఈ ఆలయాన్ని మూసివేసి, తిరిగి పున్నమిరోజు తెరుస్తారు. ఆరోజు అమ్మవారిని దర్శించుకోవడం ఎంతో అదృష్టంగా భావించిన భక్తులు ఆ రోజు అక్కడికి చేరుకునేలా జహీరాబాద్, అందోల్, నారాయణఖేడ్, వికారాబాద్, తాండూర్, బీదర్ తదితర ప్రాంతాలకు చెందిన భక్తులు శనివారం అర్ధరాత్రి నుంచి కాలినడకన బయలుదేరారు. మనూరు, నాగల్‌గిద్ద మండలంలోని దోసపల్లి, కరస్‌గుత్తి, దామర్‌గిద్ద, బాదల్‌గామ్ తదితర గ్రామాల నుంచి 180కిలో మీటర్ల దూరంలోని తుల్జాపూర్‌కు నడుచుకొంటూ ఐదు రోజుల్లో చేరుకోనున్నట్లు భక్తులు తెలిపారు. ఆదివారం రాత్రి వరకు జహీరాబాద్ పరిసరాల్లోని దారులు తుల్జాపూర్ వెళ్లే భక్తులతో సందడిగా కన్పించాయి. కాలినడకన వెళ్లే భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసేందుకు దాతలు ప్రత్యేక గుడారాలను ఏర్పాటు చేశారు.


జహీరాబాద్‌లో అన్నదాన సత్రాలు..